హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి యాగం చేయ డానికి డబ్బు ఇస్తాడు. ఆ మునిచంద్రుడు ఆ సొమ్మంతా మళ్ళీ ఆ మహారాజు చేతిలోనే పెట్టి "ఉంచు. కావలసి నప్పుడు వచ్చి తీసుకుపోతాను" అంటాడు.

ఆ తరువాత మరోసందర్భంలో ఆ హరిశ్చంద్రుడు ఆ మునీశ్వరునకే తన రాజ్యం అంతా ధారపోస్తాడు. రాజ్యం పుచ్చుకొని విశ్వామిత్రుడు ఆ దాచిపెట్టిన డబ్బు తెమ్మంటాడు. ఈ కథ అందరికీ తెలిసిందేకదా! ఆ కథఅంతా మనకు అక్కరలేదు. అందులో హరిశ్చం ద్రుడు విశ్వామిత్రునకు బాకీపడి అది తీర్చడానికి నానా అవస్థలు పడతాడు. ఇంతకూ మనకు కావలసిన విష యము ఏమిటీ అంటే, అప్పులు పుచ్చుకోవడమూ తీర్చడమూ అనే వ్యాపారము బహుపురాతనమైనదీ అని!

పురాణాలలోనుంచి ఇంకా ఎన్నో కథలు వివ రించి ఈ అప్పులు చేయడమూ తీర్చడమూ అనేది ఎలా కాలంనుంచీ వస్తూఉన్న సాంఘిక వ్యాపారమని చూపించగలను. కాని అది అనవసరమని తలచి ఆ విషయం వదిలేస్తున్నాను.

2. ఋణం భాగ్యముచ్ఛత్

అప్పుచేసేవాడికి ఉండవలసిన మనస్తత్వము ఎటువంటిది అన్న విషయం తీసుకుందాం. షేక్స్పి "నైదర్ ఎ బారోయర్ నార్ ఎ లెండర్ బి"

(Neither a borrower nor a lender be) అన్నాడని, అప్పులు చేయడము మంచిది కాదని కొందరు అంటారు. అది సరియైన అభిప్రాయముకాదు. ప్రాజ్ఞుడు అనవలసిన మాటా కాదు!

అప్పులు చేయనివారు ఎవరైనా ఉన్నారా అని మొదట ప్రశ్న వేసుకోవాలి. ఎవరూ లేరు. అని జవాబు వస్తుంది. దానితో మనకు అప్పులు చేయడము అనే వ్యాపారము ఎడల ఆసక్తి పుట్టుకొస్తుంది. వేదంలో కూడా, "ఋణంకృత్వా" అని ఉన్నది.

పెద్దవాళ్లు అనగా ధనవంతులు పెద్ద మొత్తాలు అప్పుగా తెస్తారు. బక్క వాళ్లు చిన్న మొత్తాలు తెస్తారు. అంతే తేడా.

అప్పులు తేవటానికి మనకు అడ్డువచ్చే రెండో విషయము ఏమిటీ అంటే, ఇల్లాగ అప్పులు చేస్తున్నాము గదా ఇవి ఎల్లాగ తీర్చడమూ అని దిగులుపడడము.

అల్లాంటి భావాన్ని ఎప్పుడూ రానీయకూడదు. అప్పులు ఎల్లాగ తీరుస్తామా అనే దిగులు ఏమాత్రమూ పెట్టుకోకూడదు. ఆ దిగులు పెట్టుకుంటే అసలు అప్పులు చేయలేము. అందుకని అల్లాంటి భావముకాని, దానికి సన్నిహితమైన భావమును గాని ఏదీ రానీయకుండా అప్పులుచేసి పారెయ్యడమే ప్రాజ్ఞుడూ, దూరదృష్టి కలవాడూ, ముఖ్యంగా బ్రతక నేర్చిన వాడూ చేయు

వలసినపని. అల్లాంటి భావాలు మంచివి కావు కాబట్టే వాటికి "వ్యభిచారీ భావా"లని పేరు పెట్టారు మనవాళ్లు.

అప్పులు చేయడము తప్పు ఎప్పటికీ కాదు. మన ప్రభుత్వమే అప్పు జేస్తున్నది. దానికి "జాతీయ ఋణం" అని పేరు. అది కోట్లకు కోట్లకు పెరిగిపోయినా ప్రభుత్వం వారు ఏమాత్రం దిగులు పడరు. అల్లాంటప్పుడు ఏ నాలుగువేలో పదివేలో అప్పు ఉన్నదని దిగులు పడడము మన తెలివి తక్కువ తనమే కాని, మరొకటి కాదు.

అప్పు అనేది ఒక విధమైన ఆస్తి అని తెలిస్తే అప్పుడు అప్పు చేయడానికి ఇంకా ఎక్కువ ధైర్యం కలుగుతుంది.

ఇల్లు, పొలము, ఫ్యాక్టరీలలో షేర్లు మొదలైన అనేక రూపాలలో ఆస్తి ఉండవచ్చు. ఆస్తి ఉండదగిన రూపాలలో అప్పు ఒకటి.

ఒకడికి అప్పు పుట్టిందీ అంటే ఆ అప్పు వెనకాల ఆస్తి ఉన్నట్లే లెక్క.

ఆస్తి లేనివాడికి ఎవరూ అప్పీయ్యరు. వాడి కే మండీ! కాకిచేత కబురంపించి వేయీ, రెండు వేలూ చేబదులుగా తెప్పించగలడు అని గొప్పగా చెపుతారు.

అప్పు అడగటానికి కొంతమంది ఎంతో సిగ్గు పడతారు. ఆ మానసిక దౌర్బల్యము ముందు పోగొట్టు

కోవాలె. సిగ్గూ భిడియమూ ఉంటే ఎవరూ బాగుపడరు. సిగ్గు అనేది పెట్టుకుంటే ఈ సినిమావాళ్ళు అంతా ఇల్లాగ అప్పులు చేయగలిగే వారేనా! ఛా,ఛా ఆ దుర్గుణం పోతేనేగాని మనం ప్రపంచంలో తల ఎత్తుకొని తిరగలేము.

ఇంకొక ముఖ్య విషయము ఏమిటీ అంటే అప్పు ఎల్లాగ తీరుస్తామా అన్న వెధవ ఆలోచన ఎప్పుడూ రాకూడదు. ఎంత వద్దనుకొన్నా ఎంత నెట్టివేసినా అల్లాంటి ఆలోచన ఒకప్పుడు మనస్సులో ప్రవేశించి కొంచెం బాధ పెడుతూ ఉంటుంది. అది ఒక విధమైన జబ్బు. ఆ జబ్బు పోవడానికి కొన్ని ఆరోగ్య సూత్రాలు చెబుతాను. వీటి ప్రకారము నడుచుకొంటే క్రమేపి ఆ రోగం కుదిరి మనిషి ఆరోగ్యవంతుడు కాక తప్పదు.

అప్పులు పెరిగిపోతున్నవి, ఈ అప్పులు ఎట్లా తీరుతవి, అన్న ఆలోచన వస్తే భయం వేస్తుంది. ఒక్కొక్కప్పుడు గుండె గుబుక్కుమంటుంది. ఇదే ఈ భయంకరమైన వ్యాధికి ప్రారంభదశ అని గుర్తించవలసి ఉన్నది.

ఈ జాడ్యం వచ్చిన తరవాత ప్రథమదశలో నాడి "లావుక" పిట్టవలె నడుస్తుందనీ, ఆ తరువాత పావురము వలెనూ, ఊరపిచ్చుక వలెనూ, లకుముకి పిట్ట

వలెనూ నడుస్తుందనీ "లోలంబ రాజీయంలో" చెప్పినాడు.

మొదటనే ఈ రోగానికి చికిత్స ప్రారంభం చేయక అశ్రద్ధ చేశామా అంటే అది తీవ్రమైన, సులభంగా నయము చేయడానికి వీలుకానిదై కూర్చుంటుంది. అన్నం సహించక పోవడమూ ఏమీ తోచకపోవడమూ ఏదో దిగులుగా ఉండడమూ మొదలైన దుర్గుణాలు క్రమంగా కనపడి చివరకు ఉన్మాదంలోకి దింపవచ్చు.

అందుకని మొదట్లోనే తగిన చికిత్స ప్రారంభించాలె. ఎట్లాగు అనేది ప్రశ్న. ఇది మనస్సుకు సంబంధించిన వ్యాధి కాబట్టి దీనిని మానసిక వ్యాపారంవల్లనే కుదర్చవలె.

లోపలనుంచి ఎవరికీ వినపడని గొంతుకతో ఎవరో చెబుతూ ఉంటారు. "నీకు అప్పులు ఎక్కువైపోతున్నవిరా అబ్బాయి జాగ్రత్త" అని.

ఆ విధంగా చెబుతూ ఉంటే ఆ కనపడని మనిషికి నీవు ఎప్పటికప్పుడు ఏవో తగిన సమాధానాలు చెపుతూ నోరు మూయించవలె

ఆ ప్రశ్నలు ఎల్లాగ ఉంటవో సమాధానాలు ఎల్లాగ ఉండవలయునో తెలిసేందుకు ఈ క్రింద అల్లాంటి సంభాషణ ఒకటి ఇచ్చినాను.

అప్పుడు అంతరాత్మ కాస్త తగ్గి "వద్దురా బాబూ ఊరుకో. ఇబ్బందులలో పడతావు!" అని చెపుతుంది.

"పడితే పడ్డాను. ప్రస్తుతం ఉన్న ఇబ్బందులు గడిస్తే తరువాత వచ్చే ఇబ్బందుల సంగతి ఆలోచించుకోవచ్చు. అయినా నీవు ఇటువంటి మాటలు చెప్పకు. నా అప్పులు ఎట్లా తీరుస్తానో నీకు అసలు చెప్పను. అంతగా తీర్చలేకపోతే ఎగగొడతాను"

"అప్రతిష్ఠరా బాబూ!" అంటుంది అంతరాత్మ.

"ఆఁ ఏమీలేదు. ఎంతమంది దివాలా తీయడములేదు. అందులో నేనొకడిని అవుతాను".

"వద్దు నా మాట విను" అంటుంది మళ్ళీ.

"నీ మాటలు వినను. నీ మాటలు విని బాగుపడ్డది ఎవరూలేరు. నీవు నోరుమూసుకో నా ఇష్టం వచ్చినట్లు అప్పులుచేసి దర్జాగా హాయిగా సుఖంగా జీవిస్తాను. ఆ అప్పులు తీర్చే విధానం దేవుడే చూపిస్తాడు. నాటు పోసినవాడు నీరు పోయక మానాడా?"

"వద్దు"

"నోరు ముయ్"

ఈ విధంగా అంతరాత్మ చెప్పే మాటలకు ఎప్పటికప్పుడు తగిన సమాధానం చెపుతూ ఉండవలె. ఆ చెప్ప

షము గట్టిగా చెప్పవలె. ఏడ్వాన్నవుతే నోరు మూసుకో అన్న ధోరణిలో చెప్పుకున్నావాలె. ఇల్లాగ చెప్పుకొంటే పోగాపోగా ఆ అంతరాత్మ అనేది చచ్చి ఊరుకొంటుంది.

సిగ్గును విడిచివేయడమూ, అంతరాత్మను చంపి వేయడమూ అనే ఈ రెండు పనులు జరిగేటప్పటికి మనుష్యునికి అప్పులు చేయడానికి కావలసిన ఉత్సాహము, మానసిక దారుఢ్యమూ వస్తవి.

ఒకవేళ మనస్సు ఇంకా పీకుతున్నట్లయితే ఇంకొక పని చేయవలసి ఉంటుంది. అది ఏమిటీ అంటే నీలో ఉండే సృజనశక్తిని మేల్కొలుపవలె.

అది ఎట్లాగూ అంటే నీకు నీవే ధైర్యం చెప్పుకోవాలె. నీలో ఉండే మహత్తరమైన ఈ శక్తికి చైతన్యం చేయాలంటే ఈక్రింది విధంగా చెప్పుకోవాలె. గట్టిగా మనస్సునకు నాటేలాగున చెప్పుకోవాలె.

“అప్పులు చేస్తున్నానూ ! ఏమి చేస్తే ? ఎందరు చేయటము లేదు ! నేనూ చేస్తాను.”

తీర్చడము ఎల్లాగు అనేదేగా ప్రశ్న ! మరేమీ ఫరవాలేదు. తీర్చేశక్తి భగవంతుడే ఇస్తాడు.

ఆ రామదాసు అప్పులు ఎవరు తీర్చారు ? చచ్చినట్లు వాళ్ళే తీర్చుకున్నారు. ఆ రామలక్ష్మణులు బంట్రోతుల వేషంలో మరీ వచ్చి అణాపైసలతో అప్పంతా తీర్చినారా లేదా !

"అయితే రామదాసు భక్తుడు, నీవేం భక్తుడివి? అంటావు. అంతేగదూ నీవు అనడము!"

"నేనూభక్తుణ్ణి ఎందుకుకాదూ? నేనూభక్తుణ్ణే! ఇదివరలో ఏమోగాని ఇప్పుడు మంచి భక్తుణ్ణిఅయినాను. నా అప్పులన్నీ భగవంతుడే తీరుస్తాడు అని నమ్మకం కుదిరినదగ్గిర్నుండీ నాకు భక్తి ఎక్కువఅవుతున్నది."

భగవద్గీతలో కూడా ఈ చేసేపనియొక్క ఫలితం ఏమిటీ అని ఎప్పుడూ ఆలోచించకూడదు అన్నాడు!

అప్పులు చేయడముకూడా ఒక పనే కాబట్టి, ఆ పనియొక్క ఫలితాన్ని గూర్చి మనము ఆలోచించ కూడదు. చేసేసి కృష్ణార్పణం అంటిమూమిగతా వ్యవహారం అంతా ఆ కృష్ణపరమాత్ముడే చూచుకొంటాడు. కాబట్టి భగవంతునిమీద భారంవేసి మన పని మనము చేసుకుపోవడమే కర్తవ్యము

నేను ఏమైనా దొంగతనం చేస్తున్నానా, ఒకరి కొంప కూలుస్తున్నానా? అటువంటిది ఏమీలేదే! నేనెందుకూ భయపడడము!

కొంప గడవక, వచ్చిన సంపాదన చాలక ఈ జీవితము ఏదో కాస్త ఆనందంగా గడవటానికి అప్పులు చేస్తున్నాను. ఇది తప్పు ఏమాత్రమూ కానేరదు.

ఋదిపోటులు చేసేవాళ్ళు చేస్తున్నారు! ఇతరు[illegible]సించి ధనం ఆర్జించేవాళ్లు ఆర్జిస్తున్నారు!

చీకటి బజార్లలో వస్తువులు అమ్మి మేడలు కట్టించేవాళ్లు కట్టిస్తూనే ఉన్నారు! అవన్నీ బాగున్నవి! భగవంతుడు హర్షిస్తున్నాడు! ఎటొచ్చీ నేను అప్పులు చేయడము తప్పు అయిందా? చాలుగాని ఇక ఊరుకో. ఇటువంటి ఆలోచనలు పెట్టుకొని జీవితము పాడు జేసుకోకురా అబ్బాయి.”

ఈ విధంగా అనేక విధాలుగా నీకు నీవు ధైర్యం చెప్పుకోవాలె. నీవు అప్పులు చేయడము అవసరమనీ, అందులో తప్పు ఏమాత్రమూ లేదనీ, అనేకమైన కారణాలు చూపి నీ మనస్సును దిట్టపరచుకో. ఇంకా ఇల్లాగ అనుకో:

“అప్పులు తీర్చలేనే అనుకొందాము. తీర్చలేక ~~పోతేమటు~~ పుట్టి మునిగింది. ఇంకొకరి దగ్గర ఉండవలసిన సొమ్ము నా దగ్గర ఉన్నది. ఉంటే ఏమి?

మద్ది సుదర్శనంగారి దగ్గర ఉండవలసిన సొమ్ము, మద్దాలి శేషగిరిరావుగారి దగ్గర ఉంటే జాతికి వచ్చిన నష్టం ఏమిటి? దేశానికి వచ్చిన నష్టం ఏమిటి?

అల్లాగ చేస్తే చట్టవిరుద్ధమనీ, ప్రభుత్వం ఊరుకోదనీ అంటావు. ఆ మాట నిజమే! అయితే అది వేరేసంగతి.

నైతికదృష్ట్యా ఈ కార్యము తప్పులేదు అని నేను అంటున్నాను. ఈ విషయంలో నేను చేసిన పనికి భగవంతునికి ఏమీ కోపం రాదు.

ప్రభుత్వానికి కోపం వస్తుందనీ, అల్లాగ అప్పులు చేసి ఎగగొట్టినవారిని ప్రభుత్వం శిక్షిస్తుందనీ అంటే, ఆ మాట నేను కాదనను. ప్రభుత్వానికి చిక్కకుండానూ, శిక్ష పడకుండానూ నేను చూచుకొంటాను.

అయితే ఇల్లాగ అప్పులుచేసి వాటిని తీర్చక పోవడము సంఘానికి ద్రోహము చెయ్యడము అని ఎవరైనా అంటే అనవచ్చు. ఇది సాంఘిక క్షేమానికి విరుద్ధము ఏమాత్రమూ కాదని నేను గట్టిగా చెప్పగలను. ఎందుకూ అంటే ఆ భాగ్యవంతుడు ధనాన్ని సద్వినియోగం చేయక ఊరికే దాచిపెట్టి ఉంచుతున్నాడు నేను దానిని సద్వినియోగం చేస్తున్నాను. ఆర్థికశాస్త్ర వేత్త ఎవ్వరైనాసరే నేను చేసినదే మంచిదని అంగీకరించక మానడు.

ఆర్థికశాస్త్రవేత్త అంటే ఎవరూ అని ప్రశ్న వస్తుంది. ఎవరైతే తాను దరిద్రంలో ఉండీ, ఇతరులకు డబ్బు చేసుకొనే ఉపాయాలు చెబుతూ ఉంటాడో అతడేనిజమైన ఆర్థికశాస్త్రవేత్త. ఆ విషయం వదిలేద్దాం.

ఇంతకూ ధనము సద్వినియోగం కావడము మంచిదీ అంటున్నాను. కొండలపై పడ్డ వర్షము పంట భూములకు చేరినప్పుడే అది సద్వినియోగమైనట్లు! కృపణుడైన వాని దగ్గర చేరిన ధనం సద్గృహస్థు వద్దకు చేరినప్పుడే భగవంతుడు సంతోషిస్తాడు.

"ఎందుకొచ్చిన తర్జనభర్జన ఇది. 'మనసా వర్తిక నాదు మాట వినుమా, మర్యాద కాపాడుమా, - అట్టే వాదించక పడిఉండు. నీకూ మంచిది-నాకూ మంచిది.

పైన వివరించిన తెలుంగున అనేకవిధాలుగా ఆత్మ బోధన చేసుకొనడము వలన మనిషి తన శక్తిలో తాను నమ్మకము కలవాడై ఎంత కష్టసాధ్యమైన పనిని అయినా చేయడానికి సమర్థుడు అవుతాడు.

ఇంతకూ సంశయనివృత్తి కావాలి. నీవు చేయ దలచుకొన్న కార్యమునందు నీకుపూర్తి అయిన నమ్మకం కుదరవలె. సంశయాత్ముడు ఏ పనీ చేయలేనివాడై వినా శం పొందుతాడు.

పైన సూచించిన విధముగానూ, ఇంకా అనేక రీతులుగానూ మనస్సును బలపరచవలసి ఉన్నది.

ఆ తరువాత సంశయము లేనట్టి మనస్సుతో, విశ్వాసంతో, ఉత్సాహంతో అప్పులు చేయటం అనే కార్యక్రమములోనికి దిగవలెను.

ఇంతవరకు వివరింపబడిన కార్యక్రమమువలన అప్పులు చేయడానికి కావలసిన మనోదార్ఢ్యము మాత్రము లభిస్తుంది. అంతమాత్రముచేత నీకు తెలియ వలసింది అంతా తెలిసింది అనుకొని ఎవరినైనా అప్పు అడిగావా దెబ్బతింటావు. అప్పుకొఱకై బయలుదేరే ముందు చేయునలసిన కృషి చాలా ఉన్నది. ఆవిషయమై తరువాత ప్రకరణములో చెప్పబడును.